శంకర్‌పల్లి మండల పరిధి శేరిగూడ గ్రామానికి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సత్య నారాయణ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు. - చేవెళ్ల రూరల్, డిసెంబర్ 15

బీజేపీ సీనియర్ నాయకుడు మల్గారి రమణారెడ్డి మాతృమూర్తి, చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయ లక్ష్మి అత్తగారు మల్గారి మాములమ్మ శనివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణా రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఆదివారం ఉదయం వేర్వేరుగా ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. - చేవెళ్లటౌన్, డిసెంబర్ 15

షాద్‌నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగూడలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. - షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 15

సజావుగా గ్రూప్-2

ఇబ్రహీంపట్నం : అభ్యర్థులను చెక్‌చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం : పరీక్షా కేంద్రం వద్ద తమ హాల్‌టికెట్ నెంబర్‌ను చెక్‌చేసుకుంటున్న అభ్యర్థులు

రంగారెడ్డి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డిజిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు సజావుగా ముగిసాయి. 42 శాతం మాత్రమే అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 90 సెంటర్లల్లో పరీక్షలు నిర్వహించగా, 56,883 మంది హాజరు కావాల్సి ఉండగా.. సుమారు 27వేల మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మహేశ్వరం డివిజన్‌లో 7444 మంది మాత్రమే హాజరయ్యారు. షాద్‌నగర్, మొయినాబాద్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో కూడా ఆశించిన రీతిలో అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 వరకు పరీక్షలు నిర్వహించారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కోసం వస్తున్న ఒక్క అభ్యర్థి కాలి సర్జరీ అవడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్న అభ్యర్థికి తమ వాహనంలో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరవేసి ఏసీపీ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆ అభ్యర్థి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీలోని పలు కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు పెద్దసంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు.

వికారాబాద్ జిల్లాలో..

నిమిషం ఆలస్యం అయినందుకు..

తాండూరు/యాలాల : తాండూరు పట్టణంలో సెంట్ మార్క్స్ హైస్కూల్, సెంట్ మార్క్స్ జూబ్లీ స్కూల్, పీపుల్స్ డిగ్రీ కాలేజ్, గంగోత్రి విద్యాలయ స్కూల్, భాష్యం జూనియర్ కాలేజ్, శాలివాహన డిగ్రీ కాలేజ్, చైతన్య జూనియర్ కాలేజ్, సింధు జూనియర్ కాలేజ్, సిద్ధార్థ జూనియర్ కాలేజ్, సింధు డిగ్రీ కాలేజ్‌లలో ఏర్పాటు చేసిన సెంటర్‌లల్లో ఉదయం 1310 మంది, మధ్యాహ్నం 1300 మంది పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు. 41 శాతం అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాసినట్లు తెలిసింది. నిమిషం ఆలస్యంతో కొందరు విద్యార్థులు పరీక్షకు దూరమయ్యారు. తాండూరులోని చైతన్య జూనియర్ కళాశాల కేంద్రం వద్ద నిండు గర్భిణి పరీక్ష రాసేందుకు వచ్చింది. సిబ్బంది పరిశీలించిన అనంతరం మళ్లీ భర్తను కలిసేందుకు బయటకి వచ్చి నిమిషం ఆలస్యం కావడంతో అక్కడి సిబ్బంది, అధికారులు పరీక్షకు అనుమతించలేదు. దీంతో ఆ గర్భిణి తపకు న్యాయం చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేసింది. పరీకా కేంద్రాలను సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిగిలో..

పరిగి : పరిగిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల కేంద్రంలో 154 మంది, పల్లవి కళాశాలలో 199 మంది, బ్రిలియంట్ స్కూల్‌లో 119 మంది, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 227 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరిగిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల, పల్లవి డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకోవడంతోపాటు మౌలిక సదుపాయాలు, వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

తాండూరు : అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

పెద్దఅంబర్‌పేట : పరీక్షా కేంద్రం వద్ద వనస్థలిపురం ఏసీపీ, అడిషనల్ డీసీపీ బందోబస్తు

ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం

కందుకూరు, డిసెంబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. సరస్వతిగూడలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కవిత నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. దెబ్బడగూడలో అయ్యప్పలు నిర్వహించిన ఇరుముడి పూజలో పాల్గొని, అయ్యప్పలను దర్శనం చేసుకున్న తర్వాత శాలువాతో సన్మానించారు. తిరిగి వెళుతూ గ్రామంలో మహిళలతో ముచ్చటించి, వారి సాదక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పింఛన్లను పెంచడం లేదని, హామీలను అమలు చేయడం లేదని సబితారెడ్డికి గ్రామస్తులు వివరించారు. ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయడం లేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసుగుచెందారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు అవుతున్న హామీలను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. పైగా మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేస్తూ, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైఎస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, వర్కింగ్ ప్రసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాము, జంగయ్య, దేవేందర్, గణేశ్, డైరెక్టర్ ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ కవిత, నాయకులు కొండల్‌రెడ్డి, వెంకటేశ్, మాజీ ఎంపీటీసీలు సురేశ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాజూనాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల కంటే రైతులే మేలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

కులకచర్ల పాంబండ ఆలయ, మార్కెట్ కమిటీ, పరిగి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి సీతక్క తదితరులు

పరిగి, డిసెంబర్ 15 : రైతుబిడ్డలందరూ చదువుకొని వ్యవసాయం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. చదువుకున్న వాళ్ల కంటే రైతులే మేలని, సంతృప్తిగా నిలబడగలిగేటట్లు ఉన్నారన్నారు. ఆదివారం పరిగిలోని మార్కెట్ యార్డులో జరిగిన నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా సయ్యద్ అయూబ్, పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమున్నా, ఏ ముఖ్యమంత్రి ఉన్నా గల్లా పట్టి పనులు చేయించగలిగే ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పరిగి ప్రాంతంలో పెద్ద మార్కెట్ కావాలని ఎమ్మెల్యే కోరగా రైతులకు అనువైన చోటు చూడాలని కలెక్టర్‌కు సూచించారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని, రైతులను ఆదుకోవాలని సీఎం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నదన్నారు. పంటల మార్పిడి అవసరమని, ఒకే పంట కాకుండా పలు రకాల పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. అనంతరం సీఎం కప్‌లో విజేతలకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రూ.5కోట్లతో మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు లక్నాపూర్ రోడ్డు వెడల్పునకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, అధికారులున్నారు.

పాంబండ ఆలయ అభివృద్ధికి కృషి

కులకచర్ల : అతి పురాతన ప్రాచీన పాంబండ ఆలయ అభివృద్ధికి, అలాగే కులకచర్ల నూతన మార్కెట్ కమిటీ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని మంత్రులు తుమ్మల, సీతక్క అన్నారు. కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాంబండ ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కులకచర్లలోని కులకచర్ల మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్, వారి డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి మంత్రి కొండ సురేఖ రాకపోవడంతో ఆలయ అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని మంత్రులు తుమ్మల, సీతక్కకు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, గ్రంథాలయ కమిటీ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

అధ్వానంగా ఎస్సీ హాస్టల్

- హాస్టల్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్

వికారాబాద్, డిసెంబర్ 15 : అధ్వానంగా మారిన ఎస్సీ హాస్టల్‌కు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లోని డైట్ కళాశాల ఎదుట ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ నియోజకవర్గంలో అన్నీ సమస్యలే ఉన్నాయన్నారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని తెలిపారు. భోజనం సక్రమంగా లేదని, నాణ్యత పాటించాలని డిమాండ్ చేశారు.

కండక్టర్ నిజాయితీ

పరిగి, డిసెంబర్ 15 : ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న పర్సును మరో ప్రయాణికుడు తీసుకువెళ్తుండగా చూసిన కండక్టర్ దాన్ని లాక్కొని పర్సు పోగొట్టుకున్న వృద్ధులికి అందజేశారు. పరిగి-షాద్‌నగర్ రూట్‌లో నడిచే పల్లె వెలుగు బస్సులో ఆదివారం ప్రయాణించిన చిట్యాల్ గ్రామానికి చెందిన వృద్ధ మహిళ అమినాబీ బస్సు దిగే సమయంలో పర్సు కింద పడిపోయింది. దీంతో ఆమె చూసుకోకుండా అలాగే బస్సు దిగి వెళ్లిపోయింది. అనంతరం మరో ప్రయాణికుడు ఆ పర్సును తీసుకునే ప్రయత్నం చేస్తుండగా గమనించిన బస్సు కండక్టర్ వడ్ల శ్యామల ఆ పర్సు అమినాబీదే అని లాక్కొన్నది. పర్సురె పరిశీలించగా ఆధార్‌కార్డుతో పాటు రూ.10వేలు ఉన్నాయి. ఆధార్‌కార్డు సహాయంతో వివరాలు కనుక్కొన్న బస్సు కండక్టర్ శ్యామల తిరుగు ప్రయాణంలో చిట్యాల్ స్టేజీ సమీపంలో డ్రైవర్ బోయిని రాజుతో కలిసి అమినాబీకి రూ.10వేలు, ఆధార్‌కార్డు అందజేశారు. కండక్టర్ నిజాయితీ పట్ల పలువురు అభినందించారు.

అమినాబీకి రూ.10వేలు, ఆధార్ కార్డు అందజేస్తున్న కండక్టర్ శ్యామల

ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయాల్సిన తీరుపై అధికారులకు వివరిస్తున్న ఎంపీడీవో వెంకటమ్మ (ఫైల్)

మున్సిపాలిటీ పేరు	వచ్చిన దరఖాస్తులు
ఆదిబట్ల	3,911
ఆమనగల్లు	4,274
ఇబ్రహీంపట్నం	4,816
జల్‌పల్లి	17,596
కొత్తూరు	1,857
మణికొండ	4,567
నార్సింగి	6,041
పెద్దఅంబర్‌పేట	9,351
షాద్‌నగర్	9,030
శంషాబాద్	10,395
శంకర్‌పల్లి	3,944
తుక్కుగూడ	4,626
తుర్కయాంజాల్	12,618

అదృష్టవంతులెవరో..?

నేటి నుంచి రంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై సర్వే..

ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులపై నేటి నుంచి జిల్లాలో అధికారులు సర్వే చేపట్టనున్నారు. ఇప్పటికే వచ్చిన అప్లికేషన్లను డాటా ఎంట్రీ చేశారు. జిల్లాలో 3,75,013 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు లు చేసుకోగా వాటిని పరిశీలించేందుకు 924 మందిని నియమించారు. ఈ ఆఫీసర్లు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇండ్ల వద్దకెళ్లి యాప్ లో పొందుపర్చినట్లు ఇల్లు ఉందా..? స్థలం ఉంటే దానికి సంబంధించిన పత్రాలను పరిశీలించనున్నారు. గతంలో ఇల్లు పొందారా..? లేదా..? అనే విషయాలను తెలుసుకోనున్నారు. అప్లికేషన్లు అధికంగా ఉండి.. ఇండ్ల కేటాయింపు తక్కువగా ఉండడంతో ఎవరికీ ఇల్లు దక్కి అదృష్టవంతులవుతారోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ)

జిల్లా నుంచి అందిన అప్లికేషన్లు
3,75,013
వాటిని పరిశీలించనున్న
924మంది అధికారులు
ప్రత్యేక యాప్ ద్వారా వివరాల నమోదు

లక్షల్లో దరఖాస్తులు.. వేలల్లో ఇండ్లు..

ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద సొంత ఇంటిని నిర్మిస్తామని హామీ ఇచ్చి ప్రజాపాలనలో భాగంగా ధరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లా లోని రెండు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీలు, 21 మండలాల నుంచి 3,75,013 దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం నియోజకవర్గాని కి 3,500 చొప్పున ఇండ్లను కేటాయిస్తామని ప్రకటించడంతో.. అప్లికేషన్లు పెట్టుకున్న వారందరికీ అందే పరిస్థితి లేదు. దీంతో ఎవరిని అదృష్టం వరిస్తుందోనని దరఖాస్తులు అయోమయంతో పాటు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాలున్నాయి. కాగా, కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలున్నాయి. అలాగే, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొంతభాగం జిల్లా పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వం సెగ్మెంట్‌కు 3,500 ఇండ్లు మాత్రమే కేటాయిస్తే ఎవరికీ సరిపోవని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే నాలుగు మున్సిపాలిటీలు, నాలుగు మండలాలున్నాయి. వీటి పరిధిలో దాదాపుగా 30,000 వరకు దరఖాస్తులొచ్చాయి. ఈ 30,000 దరఖాస్తులకు 3,500 ఇండ్లు ఏ మూలకు సరిపోవని పలువురు పేర్కొంటున్నారు. బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్ల నుంచి అత్యధికంగా 24,320 దరఖాస్తులొచ్చాయి.

సర్వే కోసం 924 మంది సిబ్బంది..

ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలించేందుకు ప్రభు త్వం 924 మందిని నియమించింది. ఈ అధికారులు వచ్చిన దరఖాస్తుదారుల ఇండ్లకెళ్లి పరిశీలించి, వివరాలు తెలుసుకోనున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వే ఈ నెలాఖరు కొనసాగనున్నది.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రభుత్వ దవాఖానకు తరలింపు.. నిలకడగా ఆరోగ్యం

దోమ కేజీబీవీ బాలికల పాఠశాలలో ఘటన

దోమ/పరిగి, డిసెంబర్ 15 : తోటి విద్యార్థిని వద్ద డబ్బులు చోరీ చేసిందనే ఆరోపణతో విద్యార్థిని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో ఆదివారం రాత్రి జరిగింది. పదోతరగతి చదువుతున్న నందిని అనే విద్యార్థిని డబ్బులు దొంగతనం చేసిందనే ఆరోపణతో మనస్తాపంతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. గమనించిన సిబ్బంది ఆమెను పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నందిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా పరిగి దవాఖానలో చికిత్స పొందుతున్న నందినిని బీఆర్ఎస్ పార్టీ పరిగి మండలాధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రవికుమార్ పరామర్శించారు. తహసీల్దార్ ఆనంద్‌రావు, మండల విద్యాధికారి వెంకట్ పర్యవేక్షిస్తున్నారు.

చికిత్స పొందుతున్న నందినిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పరీక్షా హాల్‌లో సెల్‌ఫోన్‌తో అభ్యర్థి

పోలీసులకు అప్పగించిన ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్

వికారాబాద్, డిసెంబర్ 15 : వికారాబాద్ జిల్లాలో ఆదివారం గ్రూప్-2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. వికారాబాద్‌లో 19 కేంద్రాలు ఏర్పాటు కాగా.. అందులోని శ్రీ సాయిడెంటల్ కళాశాలలో ఏర్పాటైన కేంద్రంలో మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష జరుగుతుండగా.. ఓ అభ్యర్థి హాల్‌లో అను మానాస్పదంగా కనిపించడంతో ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ అతడిని తనిఖీ చేసి.. సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించాడు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఈ కేంద్రానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

ఉత్సాహంగా హెచ్‌సీఎల్ సైక్లథాన్ హైదరాబాద్

శేరి లింగంపల్లి, డిసెంబర్15: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో హెచ్‌సీఎల్, భారతీయ సైక్లింగ్ సమాఖ్యల ఆధ్వర్యంలో ఆదివారం ''హెచ్‌సీఎల్ సైక్లథాన్ హైదరాబాద్'' మొదటి ఎడిషన్ ఉత్సాహంగా సాగింది. దాదాపు 1500 మంది ఈ సైక్లథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్ట్రాటజీ హెచ్‌సీఎల్ గ్రూప్ అధ్యక్షుడు సుందర్ మహాలింగం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రజల్ చందోలియా, హెచ్‌సీఎల్ టెక్ బిజినెస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పవన్ వాడపల్లి, హెచ్‌సీఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్, నిర్మలా దాట్ల, సీఎఫ్ఐ డైరెక్టర్ వీఎన్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కోకాపేట్ జంక్షన్ నుంచి కొల్లూర్ కూడలి వరకు 23 కిలోమీటర్ల మార్గంలో ఔత్సాహికులు సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. సైక్లథాన్ ప్రొఫెషనల్ రోడ్ రేస్ (52 కి.మీ) విభాగంలో ప్రథమ విజేతగా దినేశ్ కుమార్ ముస్కాన్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సాహిల్‌కుమార్ దయానికా గొగొయ్, హర్దీవీర్ సింగ్ నిలిచారు. అమెచ్యూర్ రోడ్ రేస్ (52 కి.మీ) విభాగంలో నిహాల్ నదాప్, కెథన్ పాండ్య, సోహెల్ బర్గిర్ జినత్ సయ్యద్, వరుణ్ అనామిక వర్మ, ఎంటీబీ రోడ్ రేస్ (23 కి.మీ) విభాగంలో భర్నాలీ మెహతా, రాహుల్ కుంద్రా, వందనా దావతే విజేతలుగా నిలిచారు.

హెచ్‌సీఎల్ సైక్లథాన్ హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న సైక్లిస్టులు